క్లుప్తంగా

వర్షం.. రైతుల హర్షం


దహెగాంలో కురుస్తున్న వర్షం

దహెగాం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అడపాదడపా వర్షాలు కురువడంతో రైతులు విత్తనాలు విత్తుకున్నారు. వారం రోజుల నుంచి వర్షాల జాడ లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. ఆదివారం రాత్రి, సోమవారం సాయంత్రం మోస్తారు వర్షాలు కురువడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పత్తికి ఈ వర్షం అనుకూలమని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

ఆన్‌లైన్ పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: ఉపాధ్యాయులు చేయాల్సిన ఆన్‌లైన్ పనులను వేగవంతం చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల డేటా, విద్యార్థుల ప్రోగ్రెషన్ యాక్టివిటీస్ వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. యూడైస్‌ప్లస్, ఐఎస్ఎంఎస్‌లో చేయాల్సిన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీసీవో, సీఆర్‌పీలు ఉన్నారు.

సింగరేణి పాఠశాలలో ఉత్తమ విద్యాబోధన

రెబ్బెన: సింగరేణి ఉన్నత పాఠశాలలో సింగరేణి ఉద్యోగులు, సమీప గ్రామాల పిల్లలకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందుతోందని గోలేటి సింగరేణి పాఠశాల హెచ్ఎం రవితేజ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు విశాలమైన క్రీడా మైదానం, నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఎన్‌సీసీ, పాలిటెక్నిక్ శిక్షణ, పలు క్రీడాంశాల్లో క్రీడా శిక్షణ లభిస్తుందని తెలిపారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షురాలిగా శంకరమ్మ

రెబ్బెన: మున్నూరు కాపు సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన కుందారపు శంకరమ్మ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కుందారపు శంకరమ్మను జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.

కాగజ్‌నగర్‌రూరల్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎమ్మాజీ సంతోష్ నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నియామకపత్రం స్వీకరించారు.

పాఠశాలకు ప్లేట్లు అందజేత


విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న రవికుమార్

రెబ్బెన: మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం గతంలో పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహించిన దొడ్డిపట్ల రవికుమార్ 35 మధ్యాహ్న భోజన ప్లేట్లు అందజేశారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులు వైద్యులను సంప్రదించాలి


డయాలసిస్‌పై అవగాహన కల్పిస్తున్న తిరుపతి

ఆసిఫాబాద్‌అర్బన్: కిడ్నీ వ్యాధిగ్రస్తులు ప్రతీ మూడు నెలలకోసారి సంబంధిత వైద్యులను సంప్రదించి వైద్యపరీక్షలు చేయించుకోవాలని డయాలసిస్ ట్రయినర్, ఇన్‌చార్జి టెక్నీషియన్ తిరుపతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయాలసిస్ రోగులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే కరెంట్ కట్


తిర్యాణిలోని సబ్‌స్టేషన్

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- తిర్యాణి, గిన్నెదరిల్లో సబ్‌స్టేషన్‌లు
- పని చేయని బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్
- మూగబోతున్న సెల్‌ఫోన్లు

తిర్యాణి: వర్షాకాలం వచ్చిందంటే చాలు మండలంలో కరెంటు కష్టాలు మొదలవుతాయి. చిన్న గాలివాన వచ్చిందంటే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం సర్వసాధారంగా మారింది. మండలంలో 29 గ్రామపంచాయతీలుండగా దాదాపు 114 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. కాగా విద్యుత్ సరఫరా చేపట్టడం కోసం మండల కేంద్రంతో పాటు గిన్నెదరి గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. వీటి ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేపడుతున్నారు.

తరచూ సమస్యలు..

గతంలో మండలంలోని గిన్నెదరిలో మాత్రమే సబ్‌స్టేషన్ ఉండటంతో వానాకాలంలో తరచూ విద్యుత్ సమస్య ఏర్పడేది. ఈ సమస్యను అధిగమించేందుకు 20 ఏళ్ల క్రితం మండల కేంద్రంలో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. మండలానికి వచ్చే విద్యుత్ లైన్లు దట్టమైన అటవీ ప్రాంతం గుండా ఉండటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో సమస్యను గుర్తించడం సిబ్బందికి కష్టతరంగా మారుతుంది. దీంతో గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఒక్కోసారి రాత్రంతా విద్యుత్ ఉండకపోవడంతో ప్రజలు జాగారం చేయాల్సిన దుస్థితి నెలకొంటుంది. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ద్వారా వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మండల కేంద్రంలోని మేజర్ నెట్‌వర్క్ బీఎస్ఎన్ఎల్ విద్యుత్ లేని సమయంలో పనిచేయడం లేదు. దీంతో వేలాదిమంది సెల్‌ఫోన్‌లు మూగబోతున్నాయి. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటానికి ప్రధాన కారణం 33 కేవీ విద్యుత్ లైన్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం, నాణ్యమైనా ఇన్సులెటర్లు లేకపోవడమనే ఆరోపణలు ఉన్నాయి.

బిజినెస్ దెబ్బతింటుంది..



మండలంలో చిన్నపాటి వర్షం పడినా గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో బిజినెస్ తీవ్రంగా దెబ్బతింటుంది. తరచూ అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు అధికారులు విద్యుత్ లైన్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి. – పులి వెంకటేశ్, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు

మరమ్మతులు చేపడుతాం..

మండలంలో విద్యుత్ లైన్లు ఎక్కువశాతం అటవీ ప్రాంతంలో ఉండటంతో వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఈదురుగాలులు వచ్చిన ప్రతీసారి విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నాం. ఇన్సులెటర్లు చెడిపోయిన చోట కొత్త వాటిని ఏర్పాటు చేశాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
– రవీందర్, ట్రాన్స్‌కో ఏఈ

ప్రమాదాలు జరిగినా పట్టింపేది..?



తిర్యాణి: మండలంలోని గిన్నెదరి పీహెచ్‌సీకి వెళ్లేదారిలో ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. లక్ష్మీపూర్ గ్రామ రైతు సెడ్మకి హనుమంత్‌రావుకు చెందిన దూడ శనివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘతానికి గురై మృతి చెందగా, రెండు నెలల క్రితం ఇదే రైతుకు చెందిన ఎద్దు ఇదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కనీసం కంచె కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కాగా ఈ విషయంపై ట్రాన్స్ కో ఏఈ రవీందర్‌ను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గద్దె నిర్మించడం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు అందించినట్లు పేర్కొన్నారు.

రోడ్డుపై వరదనీటితో తిప్పలు


రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోని రోడ్డుపై వరదనీరు ప్రవహించడంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో వరదనీరు రోడ్డుపై ప్రవహించడంతో పట్టణ వాసులు అవస్థలు పడ్డారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి మార్కెట్‌కు వెళ్లాలంటే ఈ మార్గం గుండానే వెళ్లాలి. డ్రెయినేజీ లేకపోవడంతో మురికి నీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పారదర్శకంగా ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న సింగరేణి ఉద్యోగులకు నివాస క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని ఎస్వోటూ జీఎం కే.రాజమల్లు అన్నారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో క్వార్టర్ల కోసం దరఖాస్తు చేస్తున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియాకు ఇటీవల బదిలీపై వచ్చిన, నూతనంగా విధుల్లో చేరిన ఏడుగురు ఉద్యోగులకు కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసుకున్న క్వార్టర్లను కేటాయించారు. అనంతరం ఎస్వోటూజీఎం మాట్లాడుతూ క్వార్టర్ల కోసం ఉద్యోగులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. సీనియార్టీ ప్రతిపాదికన కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్ల కేటాయింపు జరుగుతుందని, కేటాయింపుల్లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదని సూచించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్ రావు, డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనా బాషా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, కైరిగూడ వెల్ఫేర్ అధికారి రజనీకుమార్, జూనియర్ అసిస్టెంట్ సాయివెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి


దహెగాం: శ్యామప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దహెగాం: సామాజిక న్యాయం కోసం పాటుపడ్డ డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు లగ్గాం దామోదర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశభక్తి, దూరదృష్టి కలిగిన విద్యావేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాపర్తి ధనుంజయ్, పడాల సురేశ్, ఎల్కరి సంజీవ్, కోఠారి బాపు, ప్రదీప్, కేదర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ భారతీయ జనసంఘ్ పార్టీని డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ స్థాపించి హిందూ జాతీయ వాదాన్ని ప్రచారం చేశారన్నారు. దేశం మొత్తంలో హిందు, ముస్లింలకు ఒకే విధమైన పౌరస్మృతి ఉండాలని గలమెత్తారని తెలిపారు. బీజేపీ నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, సమీర్ గుప్తా, అరుణ లోయ, వల్పదాసు రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ బుద్దె స్వామి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు, యువత సహకరించాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. ఈనెల 26వ తేదీన డ్రగ్స్ డే పురస్కరించుకుని సోమవారం నుంచి గురువారం వరకు జిల్లాలోని కళాశాలల్లో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను ఎస్పీ సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభించారు.

రెబ్బెన: జిల్లాలో గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించాలని సీఐ బుద్దె స్వామి అన్నారు. సోమవారం మండలంలోని కొండపల్లి బస్టాండ్ వద్ద మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో అన్ని గ్రామాల్లో మత్తుపదార్థాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతీ సోమ, గురువారాల్లో ఒక పాఠశాల, ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి సాగు చేసిన, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెల్లం, పటిక పట్టివేత


పట్టుకున్న బెల్లం, పటికతో ఎక్సైజ్ అధికారులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామంలోని ప్రవీణ్ కిరాణా షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం, పటికను సోమవారం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపారు. ముత్తంపేటలో నాటుసారా తయారీకి వినియోగించే 160 కిలోల బెల్లం, 80 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కిరాణాషాపులో అక్రమంగా బెల్లం, పటికను నిల్వ ఉంచిన ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ దందాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై సురేశ్ పాల్గొన్నారు.

పురుగుల బెడద నివారించాలని వినతి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కాపువాడలో వింత పురుగులు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, వాటిని నివారించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పురుగులు ముకుమ్మడిగా ఇళ్లలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, వీటితో దద్దుర్లు వచ్చి అనారోగ్యం పాలవుతున్నామని వివరించారు. అధికారులు పురుగుల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కాలనీవాసులు పిర్సింగుల కోటేశ్, ఎమ్మాజీ మహేశ్, ఎల్క శ్రీనివాస్, ప్రసాద్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- నిలిచిపోయిన బీటీరోడ్డు నిర్మాణ పనులు
- వర్షాలు పడటంతో ప్రజలకు మొదలైన కష్టాలు


కంకర వేసి వదిలేసిన రాంపూర్ రోడ్డు

రెబ్బెన: మారుమూల గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం బీటీ రోడ్లు మంజూరు చేసింది. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేయకపోగా బిల్లులు అందలేదనే సాకుతో అసంపూర్తిగా పనులను వదిలేశాడు. సంవత్సరం గడుస్తున్నా పనుల్లో పురోగతి లేకపోగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామీణ రోడ్లు బురదమయంగా మారిపోయాయి. బీటీ రోడ్డు పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని ఎంతో ఆశపడ్డ మారుమూల ప్రాంతాల ప్రజలకు నిరాశ మిగిలింది. వర్షాకాలం మొదలు కావడంతో మట్టిరోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. దాంతో అత్యవసర పరిస్థితుల్లో దేవుడే దిక్కు అని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

కలగానే మిగిలిన బీటీ రోడ్డు

గత రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ఆవాస ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఐటీడీఏ నిధులు కేటాయించింది. గిరిజనులు నివాసం ఉండే గ్రామాల్లో కనెక్టివిటీ, నాన్ కనెక్టివిటీ రోడ్ల కోసం నిధులు మంజూరు చేయగా మొదటి విడుతలో మండలానికి రూ.3.96 కోట్లతో నాలుగు గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయి. వాటిలో ఒక్క రోడ్డు కూడా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కొత్తపులికుంట వరకు 2 కి.మీ రూ. 1.16 కోట్లు, నారాయణపూర్ పంచాయతీలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పైకాజీగూడ వరకు రూ.1.05 కోట్లతో 1.2 కి.మీ, రాంపూర్ పంచాయతీ పరిధిలోని పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రాంపూర్ గ్రామం వరకు 2 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లు, రోళ్లపాడు పంచాయతీలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రోళ్లపాడు గ్రామానికి 1.2 కి.మీ మేర రోడ్లు మంజూరు చేసింది. రెండో విడతలో పైకాజీగూడకు 3 కి.మీ బీటీ రోడ్డుతో పాటు రోడ్డు మధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం కోసం మరో రూ. 3.6కోట్లు మంజూరు చేసింది. సంవత్సరం లోగా పనులను పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం రోళ్లపాడు రోడ్డును మాత్రమే పూర్తి చేశారు. రాంపూర్ రోడ్డుపై కంకర వేసి తారు వేయకుండానే వదిలేశారు. దాంతో కంకరతో కూడిన రోడ్డుపై ప్రయాణించలేక ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. వాహనాలు అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలు సైతం అనేకం చోటు చేసుకుంటున్నా అధికారులు పనులు పూర్తి చేయడంపై నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ఇక కొత్తపులికుంటకు మంజూరైన రోడ్డు విస్తరించి మట్టిపోసి వదిలేశారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డు గుంతలుపడి బురదమయంగా మారుతోంది. గ్రామంలోకి కనీసం 108 వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇక పైకాజీగూడకు మంజూరైన రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

బురద రోడ్లే దిక్కు

మండలంలోని కొత్తపులికుంట, పైకాజీగూడ గ్రామాలకు గతంలో కనీసం మెటల్‌రోడ్డు సౌకర్యం కూడా అందుబాటులో లేదు. గ్రామాలు ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు మట్టిరోడ్డు సౌకర్యమే గ్రామస్తులకు దిక్కుగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ నిధులతో బీటీ రోడ్లు మంజూరైనప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో నేటికీ ఆయా గ్రామాల ప్రజలకు మట్టిరోడ్లే దిక్కయ్యాయి. నారాయణపూర్ నుంచి పైకాజీగూడ మధ్యలో సుమారు 5 కి.మీ దూరం ఉండగా వర్షాకాలంలో గ్రామానికి కనీసం నడిచి వెళ్లే పరిస్థితి ఉండదు. అత్యవసర పరిస్థితుల్లో ఎడ్లబండిపై నారాయణపూర్‌కు రావాల్సిన దయనీయ పరిస్థితి ఉంది.

బిల్లులు రాక..

రాంపూర్, కొత్తపులికుంట గ్రామాలకు మంజూరైన బీటీ రోడ్ల పనులు సంవత్సర కాలంగా ముందుకు సాగడం లేదు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకపోవడంతో పనులను నిలిపివేశారు. అయితే పైకాజీగూడకు మంజూరైన రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. ప్రభుత్వం బిల్లులు విడుదల చేయగానే రాంపూర్, కొత్తపులికుంట రోడ్ల పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నారు. – బద్రోద్దీన్, ఏఈ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడీ ప్రాంతంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు కసాబ్‌వాడీ, సిద్ధి వినాయక నగర్, బ్రాహ్మణవాడ, రావులవాడ, జైన్ మందిర్ ఏరియా, శివకేశవమందిర్, ఓల్డ్‌పోస్ట్ ఆఫీస్, మేకలవాడ, గొడవెల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మి రాజ్యం తెలిపారు.

నేడు రైతుభరోసా సంబరాలు

బెజ్జూర్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలో రైతుభరోసా సంబరాలు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు భూస శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పార్కు సమయపాలన పాటించరా..?


తాళం వేసి ఉన్న ఎల్లగౌడ్‌తోటలోని పార్కు


గోడ దూకుతున్న యువకుడు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లగౌడ్‌తోటలోని పార్కుకు ప్రతీరోజు ఉదయం వ్యాయామం చేసుకునేవారు, వాకింగ్ చేసే వాకర్స్, మహిళలు, సీనియర్ సిటిజన్లు, యువత వస్తుంటారు. ప్రతీరోజు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు పార్కు తెరిచి ఉండాలి. కానీ సోమవారం ఉదయం 7 గంటలకు కూడా గేటు తాళం తెరువకపోవడంతో పార్కుకు వచ్చిన వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. మరికొందరు పార్కు గోడ దూకి లోనికి ప్రవేశించి వాకింగ్, వ్యాయామం చేసుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని వాకర్స్, స్థానికులు కోరుతున్నారు.

పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా రాజేశ్వర్‌రావు


రాజేశ్వర్‌రావుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా డీవైపీఎం రాజేశ్వర్ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేట్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్‌లో డీవైపీఎంగా పనిచేసిన ఆయన బెల్లంపల్లి ఏరియా పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పర్సనల్ డిపార్టుమెంట్ ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్‌లు బాబా, అర్చన, అనిల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.